పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ

చిత్తూరుఅర్బన్: విధినిర్వహణలో మృతిచెందిన పోలీస్ కుటుంబాలకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్‌పి రిషాంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో మృతిచెందిన పోలీస్ కానిస్టెబుళ్లు రమేష్‌బాబు, సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు రమేష్ సతిమణి సుభాషిణికి రూ. 75వేలు, సుబ్రమణ్యం పిల్లలకు కోవిడ్ మాన్‌కైండ్ ఫండ్ నుంచి రూ. 3లక్షల చెక్కును అందజేశారు.

ఆర్థిక సాయం అందిస్తున్న జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- నిబంధనలు పాటించని హోటళ్లు
- మూడు రోజుల్లో 21 గ్యాస్ట్రో ఎంటిరైటిస్ కేసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

లాభం ముఖ్యధ్యేయం వ్యాపారం... హానికర రసాయనాలతో రోజుల తరబడీ రిఫ్రిజిరేటర్లలో ఉంచిన మాంసం.. ఆహార పదార్థాలతో కొన్ని హోటళ్లు నగరంలోని ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయి. మరి కొన్ని హోటళ్లలో కనీసం ప్రాథమిన నిబంధనలు కూడా పాటించండం లేదు. అపరిశుభ్రత, హానికర ఆహార పదార్థలను ప్రజలకు అందిస్తూ రోగాల భారిన పడేస్తున్నారు.

హోటళ్లలోని మాంసం, చికెన్, రొయ్యలను పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు నగరపరిధిలో మూడు రోజుల వ్యవధిలో కల్తి ఆహారం తీసుకోవడం వల్ల 21 మంది ఆసుపత్రుల పాలైయ్యారంటే పరిస్థితి ఎంత గోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నూతన సంవత్సర వేడుకల్లో నగరంలోని దర్గా సర్కిల్ సమీపంలో గల ఓ ప్రముఖ నాన్‌వేజ్ హోటల్‌లో వన్ ప్లస్ వన్ బిర్యాని తీసుకున్న కుటుంబం ఆసుపత్రి పాలైంది. వైద్యులు ఫుడ్‌పాయిజన్ వల్ల అనారోగ్యానికి గురైన్నట్ల నిర్థారించారు. బాధిత కుటుంబం పోలీసులను, ఫుడ్ కంట్రోల్ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో సంఘటన వెలుగులోకి వచ్చింది. పిర్యాదు అందుకున్న పుడ్‌కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించి పుడ్ శ్యాంపిల్స్ సేకరించి టెస్టింగ్ కోసం హైదరాబాద్ పంపారు.

ఇదిలా ఉంటే రెండు హోటల్స్‌లో నగర కమిషనర్ మున్సిపల్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో కుళ్లినస్థితిలో ఉన్న రొయ్యులు, మాంసం, ఫ్రిజ్లలో ఉంచిన మాంసం అపరిశుభ్రంగా వంట గదులు దర్శనం ఇచ్చాయి. నగరంలోని ఒకటి రెండు కాదు దాదాపు చిన్న, పెద్ద అని తేడా లేకుండా అన్ని హోటళ్ళు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా ప్రజాఆరోగ్యంతో చెలగాటం అడుతున్నాయి. ఎలాంటి నిబంధనలు పాటించకుండా పాస్ట్‌పుడ్ పేరుతో అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారు. పెద్ద హోటళ్ళు సైతం రోజువారి అమ్ముడు పోయే ఆహార పదార్థలను ఫ్రిజుల్లో నిల్వ ఉంచుతున్నారు.

వేడివేడిగా వండిపెడుతున్న ఆహార పదార్థల వెనుక వంటగదులు ఏమాత్రం శుభ్రంగా ఉన్నాయనే విషయాన్ని సహజంగా పట్టించుకోరు. పుడ్‌సేఫ్టీ అధికారుల నిబంధనల మేరకు ఇడ్లీలు చేసేందుకు ప్లాస్టిక్ కవర్లు వాడకూడదు. అలాగే ఫాస్ట్‌ఫుడ్, చికెన్, మంసాంహారాలు, చేపలకు రసాయానాలు వాడకూడదు. వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలి. హోటల్ నిర్వహణ కోసం నగర పాలక సంస్థ, పుడ్‌సేఫ్టీ అధికారుల అనుమతులు తీసుకోవాలి. బహిరంగం ప్రదేశాల్లో అమ్మకాలు చేపట్టకూడదు. ప్యాకింగ్ ఆహార పదార్థలపై ఎక్స్‌పైరీ డేట్ తప్పనిసరిగా ముద్రించాలి.

శుభ్రత, నాణ్యత పరిశీలించుకోవాలి
- డాక్టర్ జె.అరుణ, నగర కమిషనర్

వీలైనంత వరకు ఇంట్లో వండిన ఆహార పదర్థాలను తీసుకోవడం మంచిది. హోటల్స్‌లో భోజనం, నాన్‌వేజ్ తినే సందర్భాల్లో జాగ్రత్తలు పాటించాలి. ప్రధాన హోటల్స్‌లో తినేముందు వంట గదులను పరిశీలించవచ్చు. ఇది వినియోగదారులు హక్కు ఆహారపదార్థలు శుభ్రంగా నాణ్యతగా ఉన్నాయని నిర్థారించుకున్న తరువాతే తినాలి. నాణ్యతా లోపం, అపరిశుభ్రత కారణంగా జబ్బుల భారినపడే ప్రమాదం ఉంది. ఎంహెచ్‌ఓ నేతృత్వంలో నగరంలోని హోటళ్లపై దాడులు చేపడుతాం. ప్రాథమికంగా రెండు హోటల్స్‌ను తనిఖీ చేయడం జరిగింది. ముందుగా నగరంలోని అన్ని హోటల్స్‌ను తనిఖీ చేసి నోటీసులు జారీ చేయడం జరుగుతుంది. ప్రజాఆరోగ్యానికి ప్రమాదకరంగా ఆహార పదార్థలు విక్రయించే హోటల్స్‌పై చర్యలు తప్పవు.

అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

స్టాడింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ, మేయర్ అముద

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నగరపాలక స్టాండింగ్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం నగరపాలక కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగింది. సమావేశంలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్, ఆర్‌జి.శ్రీకాంత్, బి.పూర్ణచంద్రరావు, సి.శోభ, ఎజి.సహదేవున్‌లు హాజరయ్యారు. సమావేశంలో అజెండా, టేబుల్ అజెండాలో పొందుపరిచిన పలు అభివద్ధి పనులపై చర్చించి ఆమోదించారు.

అజెండా అంశాలు..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 23, 24వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అర్హత గల బిడ్డరుకు ఎల్ఓఎ జారీ, 9వ వార్డు పరిధిలో లక్ష్మీనగర్ కాలనీలో రూ. 40లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం, నగరపాలక సంస్థ పరిధిలో 50 వార్డులలో పవర్ బోర్లలో మరమ్మతుల సమయంలో మోటారు, పైపులను తీయడానికి లిఫ్టింగ్ వాహనం కొనుగోలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న హరిత నగరాల్లో భాగంగా కూడళ్లు, డివైడర్లలో వివిధ రకాల పనులు చేయడం కోసం 10 మంది వర్కర్ల నియామకం, ఏఎస్ఎం షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాప్ రూమ్ నెంబర్ 18 కోసం వేలంపాటలో పాల్గొని గుడ్‌విల్ పాడిన మొత్తం మేరకు షాపులు కేటాయింపు. కొంగారెడ్డిపల్లి కూరగాయల మార్కెట్ వెనక భాగంలో ఉన్న స్థలాన్ని లీజుకి ఇవ్వడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నగర పాలక సంస్థ స్టాడింగ్ కమిటి ఆమోదించింది. ఈసమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ ధనలక్ష్మీ, ఎసీపీ రామకష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

17 లక్షల పని దినాలను కల్పించాలి : కలెక్టర్

ఉపాధి హామీ పనులపై డ్వామా అధికార్లతో సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని చేరుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని 23వ తేదీ నుంచి మరింత ఎక్కువ మందికి ఉపాధి కల్పించి రెండున్నర నెలలలో పూర్తిస్థాయిలో లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ గురువారం ఉదయం జిల్లాలో డ్వామా ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈఏడాదికి 84 లక్షల పది దినాలను కల్పించాల్సి ఉండగా ఇప్పటివరకు 66 లక్షల లక్ష్యాలను చేరుకోవడం జరిగిందన్నారు. ఈ లక్ష్యాలను చేరుకోవాలంటే ఈనెల 23నుంచి విడతల వారీగా మరింత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 6 నాటికి రోజు లక్ష మందికి ఉపాధి కల్పించే విధంగా పనులను ఎంపిక చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో వివరాలను పొందుపరచాలని అదేవిధంగా ఇచ్చిన లేదా నిర్ణయించుకున్న లక్ష్యాలను సాధించేలా తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఉదయం 6 గంటల సమయానికి పనులలో దిగేటట్లు చూడాలని అన్నారు. ఈ సందర్భంగా తక్కువ ప్రతిభ చూపిన మండలాలకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ పథకం ద్వారా ఎంపిక చేసిన గ్రామాలలో పనులను వేగవంతం చేయాలని పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఎన్ఎంఎంఎస్ పథకం ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేసి మరింత ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలన్నారు. గహనిర్మాణ పథకం ద్వారా మరింత ఎక్కువమందికి పని కల్పించాలని వేగంగా గహనిర్మాణాలు జరుగుతున్నాయని వారిని అందరిని ఈ కార్యక్రమంలో తీసుకోనీ ఉపాధి కల్పించాలన్నారు. ఉపాధి హామీలు పనిచేసే వారికి ఎట్టి పరిస్థితులలోనూ రోజువారి వేతనం 246 రూపాయలు తగ్గకుండా చూడాలని అన్నారు. అమత్ సరోవర్ ప్రాజెక్టు కింద జిల్లాకు 70 ప్రాజెక్టులు మంజూరు కావడం జరిగిందని ఇప్పటి వరకు 31 ప్రాజెక్టులు పూర్తి అయ్యాయని మిగిలినవి వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని, ఏపీడీలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వరప్రసాద్, వెంకటరత్నం, శోభన్ బాబు, ప్రియదర్శిని, జయ చంద్ర, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశు జననానికి వారు తీసుకోవలసిన పోషకాహారం, జాగ్రత్తలపై అంగన్వాడీ కార్యకర్తలు మరింత శ్రద్ధ చూపేలా సిడిపిఓలు వారివిధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ యం.హరి నారాయణన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, ఐసిడిఎస్ పీడీ నాగశైలజాతో కలిసి సిడిపిఓలతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఎత్తు, బరువు తక్కువ గల పిల్లల ఆరోగ్య పరిస్థితులకు సంబంధించి పీడియాట్రిషన్ సూచనలతో వారి ఆరోగ్య పెరుగుదలకు సంబంధించి వారి తల్లికి తగు సూచనలు అందించాలని వాటిని వారు పాటించేలా అవగాహన పెంచాలన్నారు. డాక్టర్ సూచనలు మేరకు ప్రతినెలా పిల్లలు బరువు పెరిగేలా వారికి అవసరమైన పోషకాహారం అదనంగా అందించేందుకు కషి చేయాలన్నారు. సిడిపిఓలు వారి పరిధిలో గల బరువు తక్కువ గల పిల్లలను, రక్తహీనత గల గర్భిణుల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలని వారికి అవసరమైన వైద్యసలహాలు ఎఎన్ఎం, ఆశా అంగన్వాడీ కార్యకర్త సహాయంతో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బాల్య వివాహాలను నియంత్రణకు సచివాలయ స్థాయిలో మహిళా పోలీస్, పంచాయతీ సెక్రెటరీ, విఆర్ఓ కషి చేయాలన్నారు. బాల్యవివాహాల వలన ఆడపిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమ స్యలపై అవగాహన పెంచాలన్నారు.

స్త్రీ శిశుసంక్షేమశాఖ చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షిస్తున్న కలెక్టర్

సచివాలయాల నుంచి రిజిస్ట్రేషన్లకు సర్వం సిద్ధం

గ్రామాలకు చేరిన సాఫ్ట్వేర్లు
రిజిస్ట్రేషన్లు, రీసర్వేలో మరింత పారదర్శకత : జెసి

సచివాలయ రిజిస్ట్రేషన్లపై రిజిస్ట్రార్లతో సమీక్షిస్తున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలో రీసర్వే కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందని ఇప్పటివరకు డాక్యుమెంటేషన్ మ్యాప్ ఇతర కార్యక్రమాలు పూర్తి అయిన 63 గ్రామాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని జాయింట్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ గురించి జిల్లాలోని రిజిస్ట్రార్లతో జాయింట్ కలెక్టర్ సమావేశం కలెక్టరేట్‌లోని ఛాంబర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 63గ్రామాలకు సంబంధించి జిల్లాలో రీసర్వే ప్రక్రియకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తికావడం ద్వారా ఆన్లైన్ డేటాను రిజిస్టర్ కార్యాలయానికి అందించడం జరిగిందని వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయడం పూర్తి అయిందని పైలట్ ప్రాజెక్టులో ఉన్న రెండు గ్రామాలతో పాటు మరో 63 గ్రామాలు కలిపి మొత్తం 65గ్రామాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో చేపట్టడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రజలు సుదూర ప్రాంతాలలో ఉన్న రిజిస్టార్ కార్యాలయాల వైపు రాకుండా వారు ఉన్న గ్రామాలలోని సచివాలయాలలోనే ఈ ప్రక్రియ నిర్వహించుకునేందుకు అన్ని సిద్ధం చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని భావించిన వ్యక్తులు అయితే వారి వద్ద ఉన్న ఊహకు పత్రాలను సంబంధిత గ్రామాల సచివాలయాలకు తీసుకెళ్తే అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు సచివాలయ సిబ్బంది చేయడం జరుగుతుందని అన్నారు. రిజిస్ట్రేషన్ ప్రతిసంబంధించి డాక్యుమెంట్లు అక్కడే సమర్పించాల్సి ఉంటుందని అదేవిధంగా ఎవరైనా తమ భూములకు సంబంధించి ఈసీ కావాలని భావించిన సంబంధిత సచివాలయాల్లోనే తీసుకుని వెసులుబాటు కల్పించడం జరిగిందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓ ర్చాల్సిన పనిలేదని అందుకని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం వారు ఉన్న గ్రామాలలో వారి సచివాలయాలలోని అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా భూముల యొక్క లావాదేవీలు కోర్టులలో ఉన్న ఇబ్బందులు సరిహద్దు తగాదాలు పారదర్శకంగా ఇబ్బందులు లేకుండా తొలగించుకునే అవకాశం కల్పించబడిందని అన్నారు. ప్రజలు సబ్‌రిజిస్టార్ కార్యాలయానికి రాకుండానే వారున్న గ్రామంలోని ఈ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని ఉపయోగించుకోవడం ద్వారా అనవసర కాలయాపన వ్యయము చేయాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్టార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇచ్చిన జాబితా మేరకు ఆయా గ్రామాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టేందుకు డ్రాఫ్టింగ్ ఇతరత్రా కార్యక్రమాలు సంబంధిత సచివాలయాలలోని పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఆన్లైన్ ద్వారా రికార్డుల అప్రూవల్స్ మాత్రం ద్వారా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ ఇవ్వడం జరిగిందని ఈ కార్యక్రమాన్ని ఇప్పటివరకు ప్రకటించిన 65 గ్రామాల ప్రజలే కాకుండా రానున్న కాలంలో అందరికీ వచ్చే అవకాశముందన్నారు.

ఉగాది నాటికి 24 వేల గృహ ప్రవేశాలు

నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు, పేద లందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఈ ఉగాది నాటికి జిల్లా వ్యాప్తంగా 24వేల ఇండ్లను గహప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి జిల్లాలో చిత్తూరు, కుప్పం, నగరి, పలమనేరు, పుంగనూరు అర్బన్ ప్రాంతాలలో జరుగుతున్న గహనిర్మాణాల పురోగతిపై హౌసింగ్ పిడి పద్మనాభంతో కలిసి డీఈలు, మున్సిపల్ కమిషనర్లతో సమీ క్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఉగాది నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇండ్ల గహప్రవేశాలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా మన జిల్లాలో 24వేల గహ ప్రవే శాలు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించగా ఈ లక్ష సాధనకు గహనిర్మాణ శాఖకు చెందిన ఇంజనీర్లతో పాటు మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలో గల లేఅవుట్‌లో నిర్మిస్తున్న గహాల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రధానంగా అర్బన్ లేఅవుట్‌లో ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంటు, కమ్మిలను సంబంధిత లేఅవుట్‌లో ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్న వారందరూ కలిసి తీసుకోవడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. మెప్మా ద్వారా రుణసదుపాయాన్ని లబ్ధిదారులకు అందించాలన్నారు. గహనిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు మేస్త్రీలు కూలీల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి నిర్మాణంలో పురోగతి ఉండాలని, బిబిఎల్ నుండి బిఎల్‌కు, బిఎల్ నుండి ఆర్ఎల్‌కు, ఆర్ఎల్ నుండి ఆర్‌సికి, ఆర్‌సి నుండి ఇల్లు పూర్తి అయ్యేస్థాయికి వచ్చేలా చూడాలన్నారు. అలాగే ఇంకా గహనిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఒక నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తద్వారా లక్ష్యాలను పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్లు, డీఈలు సమన్వయంతో పనిచేసి లేఅవుట్ల వారీగా ఇండ్ల పురోగతికి కషి చేయాలన్నారు. సమీక్షలో భాగంగా ప్రతి మున్సిపాలిటీ వారీగా వారికి కేటాయించిన లక్ష్యం ఇప్పటి వరకు సాధించిన ప్రగతి ఉగాది నాటికి ఇండ్ల పూర్తికి సంబంధించి భవిష్యత్తు ప్రణాళికను దాని అమలును చర్చించారు.

సామాన్యులకు అర్థమయ్యేలా వేమన పద్యాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహాకవి యోగి వేమన జయంతి సందర్భంగా గురువారం జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో వేమన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటే శ్వర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేమన పామరులకు కూడా అర్థమయేలా పద్యాలు చెప్పి మెప్పించిన కవి అని అన్నారు. ఆటవెలదిలో అద్భుతమైన కవిత్వం, అనంత విలువలు గల సలహాలు, సూచనలు, తెలుగు సంగతులు ఇమిడ్చిన మహాను భావుడు వేమన అన్నారు. వేమన పద్యాలు లోక నీతులని, సామాజిక చైతన్యం ఆ పద్యాల లక్షణమని, సమాజంలో ఆయన సజించని అంశం లేదని, ఆంగ్ల, ఐరోపా భాషలన్నింటిలోకి అన్ని ద్రావిడ భాషల్లోకి వేమన పద్యాలు అనువాదమయ్యాయని, ఐక్యరాజ్యసమితి యునెస్కో విభాగం, ప్రపంచ భాషా కవుల్లో గొప్పవారిని ఎంపిక చేసే సందర్భంలో వేమనను ఎన్నుకుని, ఆ రచనలను పలు భాషల్లోకి అనువదింప జేశారన్నారు.

వేమన సామాన్యులకు అర్థమయ్యే భాషలో అద్భుత కవిత్వం అందించారనిజెడ్పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పద్యాల ద్వారా సామాజిక రుగ్మతలపై అక్షర బాణాలను సంధించారన్నారు. తెలుగు సాహిత్య, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన అరుదైన స్థానం పొందిన మహనీయుడు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పి వైఎస్ ఛైర్‌పర్సన్ రమ్య, జెడ్పిటీసిలతో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు.

వేమన చిత్రపాటానికి నివాళ్ళు అర్పిస్తున్న జెడ్పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఎస్పీ

పివికెఎన్ కళాశాల్లో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 22వ తేది కానిస్టేబుల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాతపరీక్షా పత్రాలను భద్రపరిచేందు స్ట్రాంగ్ రూములను పివికెయన్ డిగ్రీ కళాశాల్లో జిల్లా ఎస్‌పి రిషాంత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్ అధికారులకు రక్షణకు సంబంధించిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఆర్మ్‌డ్ గార్డ్‌ను తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లును పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్ రూంలోని సిసి కెమెరాలను పరిశీలించి వాటిని చిత్తూరు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు.

పశుఆరోగ్య సేవలు విస్తృతం

ముద్ద చర్మవ్యాధిపై పాడి రైతులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రప్రభుత్వం పశువులకు వైద్యసేవలను అందించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశుఆరోగ్యసేవను తీసుకొని రావడం జరిగిందని, ఈసేవలను క్షేత్రస్థాయిలో విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి పశు సంవర్థక శాఖ పరిధిలో అమలు అవుతున్న పథకాలు, వ్యాక్సినేషన్, ఇతర సంబంధింత అంశాలపై పశు సంవర్థక శాఖ జెడి వెంకట్రావ్, ఏడీలతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య సంరక్షణపై పశు సంవర్ధకశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పశువులకు వ్యాక్సినేషన్ ప్రక్రియపై పాడి రైతులకు అవగాహన పెంచాలన్నారు. వైయస్సార్ చేయూత పథకం (పాలవెల్లువ మరియు జీవ క్రాంతి) కింద 2022-23 సంవత్సరానికి గాను 4 వేలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 4,264 పూర్తి చేయడం జరిగిందనని లక్ష్యాన్ని అధికమించామని తెలిపారు. ముద్ద చర్మవ్యాధి భారిన పశువులు పడ కుండా పాడిరైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై సచివాలయాల వారీగా పశు సంవర్ధకశాఖ అధికారులు సచివాలయ సిబ్బంది (వెటర్నరీ అసిస్టెంట్)తో సమన్వయం చేసుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముద్దచర్మ వ్యాధి భారిన పశువులు పడకుండా 4లక్షల 22 వేల 366 పశు వులకు టీకాలు వేయడం జరిగిందని దాదాపు 98 శాతం పూర్తి చేశామని తెలిపారు.

సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకున్నారు

ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకున్నారని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. గురువారం మండలంలోని తిమ్మోజపల్లి సచివాలయం కరిడివారిపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ప్రతిగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్న సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి సోమశేఖర్, కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, భరత్ కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, దొరస్వామి, పాలాక్షిరెడ్డిచ చంద్రారెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి మంజునాథ్ పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

శ్మశానానికి దారేది..?

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని ఎం.అగరం దళితవాడకు చాలా సంవత్సరాలుగా శ్మశానానికి దారి లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా చనిపోతే వారిని శ్మశానానికి తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు, బంధువులకు అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. మంగళవారం ఎం.అంజాతయ్య(65) ఆరోగ్యం బాగోలేక మరణించారు. అయితే మృతదేహాన్ని శ్మశానానికి తరలించడానికి కుటుంబ సభ్యులు పొలాల మధ్య, నీటి గుంటల్లో, బురదలో అవస్థలు పడుతూ తీసుకెళ్లారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని దళితవాడ ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా గెలవడానికే..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కుప్పంలో 36వేల ఓట్లు బోగస్ ఓట్లు ఉన్నాయని ఎంపి మిథున్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని, కుప్పంలో చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యయుతంగా ఓడించలేక 36వేల ఓట్లు బోగస్ ఓట్లు ఉన్నాయని ప్రచారం చేసి నిజమైన ఓట్లు తొలగించడానికి కుట్ర పన్నుతున్నారని తెలుగుదేశం అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారపార్టీ మంత్రులు, నాయకులు కుప్పంలో గెలుస్తాం.. చెబుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును కూడా తొలగించి చంద్రబాబు నాయుడుని ఓడించడానికి కుట్రలు చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు అధికార పార్టీ కుట్రగా అభివర్ణించారు.

డ్రగ్స్ దుష్ఫలితాలపై అవగాహన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వలన కలిగే దుష్ఫలితాలను తెలుపుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజం.. యువత భవితకు శ్రేయస్సు అంటూ నినాదాలు చేస్తూ మానవహారం ద్వారా ప్రతి విద్యార్థి డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు తోడ్పడుతామని గురువారం ప్రమాణం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ సి.మంగళ గౌరి, వైఆర్‌సి కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

సర్వీసును బట్టి ఉద్యోగోన్నతి కల్పించాలి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: రాష్ట్రంలో సుమారు 60వేల మంది పోలీస్ సిబ్బంది ఉద్యోగుల చేరినప్పటి నుంచి సర్వీస్‌తో నిమిత్తం లేకుండా ఉద్యోగ్యోన్నతి సకాలంలో రాక కొంతమంది కానిస్టేబుల్ గానే పదవీ విరమణ అవుతున్నారని జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు తెలిపారు. గురువారం వెదురుకుప్పం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసులుగా ఉద్యోగంలో చేరినప్పటి నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి ఏఎస్ఐ లుగా, ఏఎస్ఐలు గా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికీ ఎస్ఐలుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఎస్ఐగా ఆరు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారికి స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు కల్పించి సర్కిల్ ఇన్స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే సీనియారిటీ లిస్ట్ తయారు చేసి క్రిందస్థాయి సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్భాటంగా అమలులోకి తీసుకొచ్చిన వారాంతపు సెలవులు మూడు నెలలు మాత్రమే అమలు చేసి చేతులు దులుపుకున్నారని, వెంటనే వారాంతపు సెలవులు తక్షణమే అమలు చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్ళి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసు సిబ్బందికి న్యాయం జరిగే విధంగా కృషిచేస్తామని చినబాబు తెలిపారు. సమావేశంలో నాయకులు సురేష్ బాబు, పాలడుగు మధు పాల్గొన్నారు.

ముచ్చుకాలువలో పశువైద్యశిబిరం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లి పంచాయతీ ముచ్చుకాలువ గ్రామంలో గురువారం మండల పశు వైద్య శాఖ ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 85పశు వులకు పిడుదల మందు పిచికారి చేయడం, 10వ రకంగా దూడలకు నట్టల నివారణ మందు తాగించడం జరిగిందని పశు వైద్యాధికారిని చందన ప్రియ తెలిపారు. అనంతరం 8 పశు వులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు అందజేశారు. అధిక పాల దిగుబడి కోసం చేపట్టాల్సిన చర్యలు, పొదుగు వ్యాపువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పశుపోషణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి అన్న విషయాలను రైతులకు క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది వెంకట రమణ, శివ, రామకృష్ణ, బలరాం, బాలకృష్ణ పాల్గొన్నారు.

టెలికం కేబుల్ టీవీపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: వివిధ కంపెనీల టెలికం, కేబుల్ టీవీ సేవలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని రూరల్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి, చిట్టిబాబు కోరారు. మండలంలో గురువారం పలువురు మహిళలకు వివిధ కంపెనీల వివిధ కంపెనీల టెలికం సేవలు, వాటి నాణ్యత ప్రమాణాలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేల్కూరు క్రాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు భూపతి కే.వెంకటాపురం, సింధూర్ సంస్థ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి



గుడిపల్లిలో...

వెదురుకుప్పంలో..

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ప్రజాకవి, సంఘసంస్కర్త వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం వర్శిటీ వేమన భవనంలోని వేమన విగ్రహానికి వర్శిటీ రెక్టార్ ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎకె.వేణుగోపాల్ రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వర్శిటీ రెక్టార్ ఆచార్య టి.అనురాధ మాట్లాడుతూ ప్రస్తుత సమాజం పాశ్చాత్య ధోరణిలో పడిపోయి చిన్న తరగతుల నుంచి మాధ్యమాలు మారిపోయి బోధనలో కూడా మార్పులు చేసుకుంటున్న నేపథ్యంలో వేమన పద్యాలు సైతం చెప్పలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఇళ్ళల్లో చిన్న పిల్లలకు వేమన లాంటి కవుల గురించి ఆయన పద్యాలను నేర్పించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగి వేమన జయంతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు జాతిని తెలుగును ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన మహాకవి యోగివేమన అని కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జయరాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాకవి వేమన 611వ జయంతి వేడుకలు గురువారం జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు పి.వెంకట రమణరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ డాక్టర్ మునికష్ణయ్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్, శ్రీనివాసులు, డాక్టర్ బి.ప్రభాకర్ రెడ్డి, పి.మురళిరెడ్డి పాల్గొన్నారు.

సోమలలో...



బైరెడ్డిపల్లెలో...

బైరెడ్డిపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోగసాల రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, స్థానిక సర్పంచ్ వెంకటేష్‌లో ఆధ్వర్యంలో విశ్వకవి యోగి వేమన చిత్రపటానికి పూజలు నిర్వహించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: పంటసాగులో రైతులు సస్యరక్షణ పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ ఉపసంచాలకులు గోపాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అన్నూరు, ఆర్కేబీపేట గ్రామాల వద్ద రైతులు సాగు చేసిన వరి, వేరుశెనగ, మిరప, రాగి, చెరకు అలాగే నువ్వుల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ ఉపసంచాలకులు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించడం వల్ల పంటసాగులో మంచి దిగుబడి సాధించడానికి అవకాశం ఉందన్నారు. మిరపపంట నాటిన ప్రతి 15రోజులు ఒకసారి వేపనూనె పిచికారి చేయడం ద్వారా మిరపపంటకు ముడత రోగం దూరమవుతుందన్నారు. ఉధతి ఎక్కువగా ఉంటే ఆకుపై ముడత నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.2 మిల్లీని ఒక్క లీటరు నీటితో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఆకు కింద ముడత నివారణకు టోకన్ మందు 0.5 గ్రాములు, వేపనూనె 2మిల్లీ, ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నాగపద్మిని, వ్యవసాయ అధికారులు లక్ష్మీప్రసన్న, హేమలత, ఏఈవోలు గాయత్రి, హేమాద్రి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా నగదు పంపిణీ

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీ పరిధిలోని పొట్టగానిపల్లెలో శోభారాణి (30) మరణించగా వైయస్సార్ బీమా పథకం ద్వారా అంత్యక్రియలు గాను రూ.10వేలు మంజూరైనట్లు సర్పంచ్ రమేష్ బాబు తెలిపారు. గ్రామానికి చెందిన సురేష్ బాబు భార్య శోభారాణి అనారోగ్య కారణంగా బుధవారం రాత్రి మతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ రమేష్ బాబు చొరవ తీసుకొని సచివాలయ వెల్ఫేర్ అధికారితో వైయస్సార్ బీమా ప్రక్రియను మొదలుపెట్టించారు. ఆన్లైన్ ద్వారా శోభారాణి మతి చెందినట్లు ఫిర్యాదు వెళ్లడంతో ప్రభుత్వం నుండి వైయస్సార్ బీమా పథకం ద్వారా మతురాలి అంత్యక్రియలు గాను రూ.10,000లు మంజూరు కావడంతో బాధిత కుటుంబానికి అందించామని అన్నారు. అలాగే మిగిలిన రూ.90,000లు త్వరలోనే బాధిత కుటుంబానికి అందుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరంధామ, పంచాయతీ కార్యదర్శి గణపతి, సచివాలయ వెల్ఫేర్ అధికారి నజీర్ భాష, వాలంటీర్ వినోద్ నాయకులు రెడ్డప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం వాలీబాల్‌కు పుట్టినిల్లు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బంగారుపాల్యం వాలీబాల్‌కు పుట్టినిల్లు అని జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు తులసి రెడ్డి అన్నారు. గురువారం వాలీబాల్ క్రీడల పట్ల విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల్లో రాష్ట్ర టీములు 8 పాల్గొంటారని, నాలుగు మహిళలు, నాలుగు పురుషుల జట్లు పోటీలో తలపడతాయని తెలిపారు. వీరికి ప్రోత్సాహ బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి పాల్గొంటారని, వాలీబాల్ క్రీడలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీచైర్మన్ కుమార్ రాజా, మాజీసర్పంచ్ కష్ణమూర్తి, మాజీ వాలీబాల్ కోచ్ సుదర్శనం నాయుడు, జిల్లా వాలీబాల్ కోశాధికారి మురారి, ఉపసర్పంచ్ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతతోనే ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రోడ్డు భద్రతలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ మురళి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆసుపత్రి వద్ద 34వ రహదారి భద్రతా ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాహనం నడుపుతున్నప్పుడు సూచిక బోర్డులను పరిశీలించి వాహనాలు నడపాలని మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. అతివేగం ప్రమాదకరమని ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను రవాణా చేయరాదని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 50శాతం మంది తలకు గాయాల అవడం వలన మతి చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం సూచించే సూచిక బోర్డులు సలహాలు పాటించి ప్రమాదాల నివారించాలన్నారు. అనంతరం రహదారి సూచనలను పాటించాలని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివకుమార్, ఎండి ఇస్మాయిల్, గాయత్రి, ఆటోడ్రైవర్లు ద్విచక్ర వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లోని సచివాలయం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. గురువారం రాజుపల్లి, ముత్తుకూరు గ్రామసచివాలయాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ముత్తుకూరు గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బందికి ప్రజలకు స్థానికంగానే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని సూచించారు. సచివాలయ అధికారులు కూడా సమస్యల పరిష్కారానికి చదువుతూ చూపుతూ సచివాలయంలో అందించే సేవలను స్థానికంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ముత్తుకూరు పంచాయతీ కార్యదర్శి సుభాషిని, రాజుపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ సచివాలయం1, 2 పరిధిలోని నూతనంగా మంజూరైన 26 బియ్యం కార్డులను లబ్ధిదారులకు సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇటీవల ప్రభుత్వం నుండి నిధులు విడుదలైన రెండు బీమా క్లెయిమ్స్ కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి లక్ష చెప్పున చెక్కులను సర్పంచ్ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, వార్డ్ మెంబెర్స్ హాజరయ్యారు.

జగనన్న కాలనీ పనులను వేగవంతం చేయండి

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అందరికీ పక్కా ఇల్లు అనే నినాదంతో జగనన్న ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీ ఇళ్లను వేగవంతం చేయాలని ఎస్ఆర్ పురం హౌసింగ్ ఏఈ శ్రీధర్ అన్నారు. గురువారం మండలంలోని మెదవాడ, ముద్దుగుప్పం పంచాయతీలోని జగనన్న కాలనీ సందర్శించారు. ఇంటి నిర్మాణం పనులను తనిఖీ చేశారు. జరిగిన పనుల వరకు బిల్లులు పెట్టారా లేదా మెటీరియల్ కొరతలపై లబ్ధిదారులతో చర్చించారు. గహాలు త్వరగా నిర్మించుకుంటే ప్రభుత్వం త్వరగా బిల్లులు మంజూరు చేస్తుందని ఆయన అన్నారు. మండలానికి ప్రభుత్వం అదనంగా మరో 392 ఇల్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ మాధవ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుమార్ లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసులు ఐపిఎస్‌లా... వైసిపి నాయకులా..?

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పోలీసులు ఐపీఎస్‌లా.. లేక వైసిపి నాయకులా.. అని జిల్లా జనసేన జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి పండగ రోజు ఎద్దుల పరుగు పందెంలో మండలంలోని టేకుమంద గ్రామంలో జనసేన పవన్ కళ్యాణ్ జిందాబాద్ అనందుకు జనసేన సైనికులపై లాఠీచార్జి చేసి గాయపరచడం దారుణమన్నారు. రాబోయేది తమ ప్రభుత్వమని తమ ప్రభుత్వంలో తీవ్రకష్టాలను ఎదుర్కొంటారని హెచ్చరించారు. జనసేన పార్టీ నాయకుల, కార్యకర్తల గొంతు నొక్కాలని చూడడం వలన కార్యకర్తలు ఉక్రోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కోడి చంద్రయ్య, శాంతమూర్తి, శివప్రసాద్ బాలసుబ్రమణ్యం, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

కోగిలేరులో రైతుల భూ రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీలో రెవెన్యూ అధికారులు భూముల పరిశీలన చేస్తున్నట్లు సర్పంచ్ రమేష్ బాబు తెలిపారు. గురువారం పంచాయతీ పరిధిలో మొదటిగా చీకలదిన్నెపల్లిలో ఎఫ్ పీఓఎల్ఆర్ (ఫీల్డ్ లెవెల్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్) కార్యక్రమంలో భాగంగా అధికారులు పర్యటించారు. రెవెన్యూ అధికారులు మొదటిగా భూవివాదాలు, పట్టాదారు మరణించిన ఆ భూమిపై ఎవరు ఉన్నారు, ఆన్లైన్‌లో నమోదు కాని భూముల వివరాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ వద్దకు అధికారులు వచ్చినపుడు రైతులు అందుబాటులో వుండి తమ వద్ద గల పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం, ఇటీవల తీసుకున్న 1-బిల జిరాక్స్, రెండు పాస్‌ఫోటోలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరందామ, ఉప సర్పంచ్ ఈశ్వర్, వీఆర్వో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి గణపతి, సచివాలయం సర్వేయర్ అజిత, వాలంటీర్లు పవన్, సురేంద్ర, నాయకులు సుబ్రమణ్యం, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బస్సు ఆటో ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి మండలంలోని రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలో చోటు చేసుకున్నది. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం చిత్తూరు నుంచి పలమనేరుకి వెళ్తున్న ఒక ప్రైవేటు బస్సును నలగంపల్లి నుంచి బంగారుపాళ్యంకు వస్తున్న ఆటోను ఢీకొన్నది. ఈ సంఘటనలో ఆటోడ్రైవర్ బాబాకు గాయాలు కాక ప్రథమ చికిత్స బంగారుపాల్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స చిత్తూరుకు తరలించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బిఎల్‌ఓ నుంచి మినహాయింపు ఇవ్వండి

ప్రజాశక్తి- యాదమరి: సచివాలయం సంక్షేమం అభివృద్ధి కార్యదర్శులకు బిఎల్ఓల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిఆర్ఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం సచివాలయ సంఘం (361/2020) చిత్తూరు జిల్లా తరపున గ్రామవార్డు సచివలయాలలో పనిచేస్తున్న సంక్షేమ, విద్య సహాయకులు, వార్డు సచివాలయల్లో పనిచేస్తున్న సంక్షేమ మరియు అభివద్ధి కార్యదర్శులకు బిఎల్ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్‌కి, జిల్లా షెడ్యూల్డ్ కులాల మహిళ సాధికార అధికారి రాజ్యాలక్షికి వినతిపత్రం అందజేశారు. సంక్షేమ కార్యదర్శులకు పనిభారం ఎక్కువ ఉన్నందున మినహాయింపు ఇవ్వాలని గ్రామవార్డు సచివాలయాల శాఖ ఇచ్చిన ఉత్తర్వులను అమలు పరచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బాలినేని నాగభూషణం, ఉపాధ్యక్షులు గోపికష్ణ ప్రధాన కార్యదర్శి ప్రేమసాగర్, ఉపకార్యదర్శి గౌతమ్ కోశాధికారి ఆర్థర్, సచివాలయ అడ్మిన్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశోధనలకే సీఎస్ఐఆర్ ప్రాధాన్యం

ప్రజాశక్తి-క్యాంపస్: సమాజ అవసరాలకు ఉపయోగపడే విలక్షణమైన పరిశోధనలకే న్యూఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) ప్రాధాన్య ఇస్తుందని ఆ సంస్థ చీఫ్ సైంటిస్ట్ అండ్ రిక్రూట్మెంట్ హెడ్ డాక్టర్ సరళ బాలచంద్రన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం శ్రీ వెంకటేశ్వర విద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ సరళ బాలచంద్రన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సీఎస్ఐఆర్‌కు అనుబంధంగా శాస్త్ర, విజ్ఞాన విభాగాలలో 35 ప్రతిష్టాత్మక పరిశోధనా ప్రయోగశాలలు ఉన్నాయన్నారు. వీటన్నింటిలో దేశ రక్షణ, ఔషధ, జీవవైవిధ్య రంగాలకు సంబంధించిన పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులు విలక్షణమైన పరిశోధనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పద్మావతి, అధ్యాపకులు సురేష్ రెడ్డి, వైవి. రామిరెడ్డి, జి. మాధవి, మధుసూదన్ రెడ్డి, ఎన్ వివి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయస్థానాల్లో పలు ఉద్యోగాలకు పరీక్షలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా హైకోర్టు విడుదల చేసిన 600 ఉద్యోగాల ఖాళీల నోటిఫికేషన్ కు సంబంధించి న్యాయస్థానాలలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాలకు శు క్రవారం శుక్రవారం జరగనున్న పరీక్షా కేంద్రాన్ని జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీమారావు గురువారం సాయంత్రం పరిశీలించారు. తిరుపతి జిల్లా పరిధిలో సెక్షన్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్, టైపిస్ట్, కాపీస్ట్, డ్రైవర్, ఆఫీస్ సబార్డినేటర్, అసిస్టెంట్ ఓవర్సీస్ వంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న 1168 అభ్యర్థులకు మూడు విడతలలో కంప్యూటర్ ఆధారిటీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, మొదటిగా ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడో విడత సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి గంట ముందుగా హాజరు కావాలని సూచించారు. సెకండ్ అడిషనల్ జడ్జి కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కళ్యాణ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు, ఎంఆర్ పల్లి ఎస్ఐ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో క్రికెట్ ప్రాచుర్యాన్ని పెంచుతాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో క్రికెట్ క్రీడా ప్రాచుర్యాన్ని పెంచడానికి చిత్తూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ కషి చేస్తుందని అసోసియేషన్ అధ్యక్షులు బి. విజయ్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రికెట్ క్రీడ పై ఉన్న అభిమానంతో పాఠశాల నుండి కళాశాల వరకు, అటునుండి రాష్ట్ర స్థాయి వరకు క్రికెట్ టీం లకు కెప్టెన్ గా వ్యవహరించానని, అలాంటి తనను ఎలాగైనా దెబ్బ కొట్టాలని 15 సంవత్సరాలకు మునుపు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ లో కొందరు రాజకీయాలు చేస్తూ ఓట్ల కోసమే అసోసియేషన్ ఉన్నట్టుగా నడిపిస్తూ, క్రికెట్ క్రీడాభివద్ధికి వినియోగించాల్సిన నిధులను పక్కదారి మళ్లిస్తుంటే ప్రశ్నించినందుకు తనపై 2007 నుండి 2016 వరకు నిషేధం విధించారన్నారు. దీనిపై న్యాయస్థానం ద్వారా పోరాటం చేసి చిత్తూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ విజయం సాధించిందన్నారు. క్రికెట్ క్రీడ అభివద్ధి కోసం తిరుపతి ప్రాంతంలో అత్యాధునిక వసతులతో క్రీడా మైదానాన్ని నెలకొల్పడానికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తో పోరాడి సాధించుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షులు శ్రీధర్ కుమార్, శ్రీనివాసమూర్తి, జాయింట్ సెక్రెటరీ యాదవ్, కోశాధికారి గిరిప్రకాష్, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.